జై హనుమాన్



అంజికాబాగ్ రామాలయంలో తమలపాకులతో అర్చించిన ఆంజనేయస్వామి



మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి దేవస్థానంలో విశేష అలంకరణలో స్వామి



అచ్చియ్యమ్మపేట అభయ హస్తాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



భానోజీనగర్‌లో పూజలందుకున్న ధ్యానాంజనేయ స్వామి



కెప్టెన్ రామారావు జంక్షన్‌లో విశేష అలంకరణలో ప్రసన్న ఆంజనేయ స్వామి

● **భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి**

దాబాగార్డెన్స్: హనుమజ్జయంతిని నగరవాసులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆంజనేయస్వామి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంతో పాటు నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు, అభిషేకాలు జరిగాయి. దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక అలంకరణల్లో అంజనీసుతుడు దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చనలు జరిపారు. వడమాలలతో అలంకరించి, అప్పాలు తదితర ప్రసాదాలను నివేదించారు.

అంబికాబాగ్ రామాలయంలో..

జగదాంబ జంక్షన్ మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో హనుమత్ జయంతిని వేడుకగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, తమలపాకు సిందూర అర్చనలు జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపటి రాంబాబు, ప్రధాన అర్చకుడు బాలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్ణానంద సమాజంలో..

పూర్ణానంద సమాజంలో ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తమలపాకు, సిందూర అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో పూర్ణానంద సమాజం ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో..

నగరంలోని హోటల్ గ్రీన్‌పార్క్ సమీపాన గల భానోజీనగర్‌లోని ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకుడు గోపాజోష్యుల సత్య జగన్నాథ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి 12 గంటల వరకు స్వామిని పంచామృతాలతో అభిషేకించి, ప్రత్యేక అలంకరించారు. తమలపాకులు, సిందూరంతో అర్చనలు చేశారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు అర్చనలు, షోడశోపచార పూజలు, దివ్య మంగళహారతులు నిర్వహించారు.

అల్లిపురం: మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచి స్వామికి పంచామృతాభిషేకాలు, సిందూరార్చన, తమలపాకులతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు మజ్జిగ, ఉచిత ప్రసాద వితరణ చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేపట్టినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథరావు తెలిపారు.

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు ఆధ్వర్యంలో విశేష హోమం చేపట్టారు. స్వామి వారికి సిందూరపూజ, ఆకు పూజ, వడపూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి పాల్గొన్నారు. ఆలయ సలహాదారు బొడ్డేటి ప్రసాద్ స్వామిని వడమాలలతో అలంకరించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదానం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, వాసుపల్లి నారాయణరావు, బొడ్డు పోలరావు తదితరులు పాల్గొన్నారు.

● అచ్చియ్యమ్మపేటలోని అభయ హస్తాంజనేయ స్వామి ఆలయంలో స్వామికి సిందూర పూజ, లక్ష తమలపాకుల పూజలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు ఆదినారాయణ, మసేను తదితరులు పాల్గొన్నారు.

● వెంకటేశ్వరమెట్టపై ఆంజనేయస్వామి దేవాలయంలో తెల్లవారు జాము నుంచి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

● నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం వద్ద జరిగిన కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ భీశెట్టి రామారావు, జీకే ఫౌండేషన్ చైర్మన్ భీశెట్టి గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. మరికొంత మంది దాతలు పుచ్చకాయ ముక్కలు పంపిణీ చేశారు. కణితి బ్రహ్మం, భీశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.



నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



హోమంలో పాల్గొన్న పీల వెంకట అప్పల నాయుడు, బొడ్డు పోలరావు తదితరులు



వెంకటేశ్వరమెట్టపై ఆంజనేయస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విజయ దుర్గాలమ్మ వార్షికోత్సవం



విశేష అలంకరణలో విజయదుర్గాలమ్మ

అల్లిపురం: జెండాచెట్టు వీధిలోని విజయదుర్గాలమ్మ ఆలయ 23వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో హోమం జరిపించారు. గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లింగం శ్రీనివాస్, పుక్కల్ల సత్తిరాజు, యల్లయ్యమ్మ, పుక్కల్ల సోములమ్మ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శేష జీవితం హాయిగా సాగాలి



తణుకు ప్రసాదరావును సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్: పదవి విరమణ చేసిన రైల్వే ఉద్యోగి తణుకు ప్రసాదరావు శేష జీవితం హాయిగా సాగిపోవాలని తూర్పు తీర రైల్వే జోన్ అధికారులు ఆకాంక్షించారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఓ కార్యాలయంలో ప్రసాదరావు వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అంకిత భావంతో చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసరావు, ఝాన్సీరాణి, రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, మంజుల, వీఎస్‌జే రాజు, సుధారాణి, వీవీ ప్రకాష్, వీజేడీ రాజు, ఆశీర్వాదం, శ్యామ్ పాల్గొన్నారు.

త్వరితగతిన బీఆర్‌టీఎస్ విస్తరణ పనులు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశం



బీఆర్‌టీఎస్ విస్తరణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-8 పరిధి అడవివరం నుంచి పాత గోశాల వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రోడ్డు విస్తరణ పనులను శనివారం జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, ముఖ్యంగా కాలువలు, కల్వర్టులతో పాటు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. సింహాచలం దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డుపై దుమ్ము, ధూళి లేవకుండా ఎప్పటికప్పుడు నీటిని చల్లాలని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్‌ను, జోనల్ కమిషనర్ హైమావతిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్ సుబ్బారావు, డీసీపీ పద్మజ, ఏసీపీ రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు అభినందనలు తెలుపుతున్న జాన్‌వెస్లీ

దాబాగార్డెన్స్: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శివానంద్‌ను ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ కలిసి, అభినందనలు తెలిపారు. కేజీహెచ్ అభివృద్ధికి తోడ్పడాలని, ఉత్తరాంధ్ర ప్రజలకు చక్కటి సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

చురుగ్గా సామాజిక పింఛన్ల పంపిణీ



వెంకటేశ్వరమెట్టపై లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న సచివాలయం కార్యదర్శులు

అల్లిపురం: జూన్ నెలకు సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం చురుగ్గా సాగింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధిక సంఖ్యలో లబ్ధిదారులకు డీబీటీ పద్ధతిలో బ్యాంకు ఖాతాలో పింఛన్ సొమ్ము జమ చేశారు. మంచంపై ఉన్నవారు, కదల్లేని స్థితిలో ఉన్నవారు, 80 సంవత్సరాలపై వయస్సు గల వారికి, బ్యాంకు ఖాతాలు లేని వారికి సచివాలయ కార్యదర్శులు ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు. 33వ వార్డు గౌరీవీధి సచివాలయం పరిధిలో 80 మంది లబ్ధిదారులకు నేరుగా ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశామని సచివాలయం కార్యదర్శులు కిరణ్‌కుమార్ యాదవ్, జాన్‌బాబు తెలిపారు.

కమనీయం.. కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

– శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్ఠంపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

చెరువులో వాటర్ ట్యాంకర్ బోల్తా

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ రాజు గారి చెరువులో శనివారం ఓ వాటర్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రాంతంలో ఓ చోట నుంచి అనధికారికంగా భారీ ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని తరలిస్తుంటారు. ఈ క్రమంలో వాటర్ ట్యాంకర్ లోడ్‌తో వస్తుండగా ఇక్కడ చెరువు వద్ద ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ చాకచక్యంగా బయటపడ్డాడు. గతంలో ఈ చెరువు వద్ద నీటిని తోడుతుండగా అధికారులు హెచ్చరించారు. అయినప్పటికీ కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం ఇక్కడి నీటిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి వ్యాపారాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వాడవాడలా అన్న సమారాధనలు



రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో అన్నసమారాధన



వెంకటేశ్వరమెట్టపై ..

అల్లిపురం: హనుమాన్ జయంతి సందర్భంగా నగరంలో వాడవాడలా అన్నసమారాధన నిర్వహించారు. పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. నీలమ్మ వేపచెట్టు దరి భక్తులకు, పాదచారులకు, వాహన చోదకులకు మజ్జిగ, పుచ్చకాయ ముక్కలు అందజేశారు. మధ్యాహ్నం కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ వారి దేవాలయంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ గౌరవాధ్యక్షులు పీల వెంకట అప్పలనాయుడు ప్రారంభించారు. వెంకటేశ్వరమెట్టపై గల ఆంజనేయ స్వామి దేవాలయంలో అన్నసమారాధన నిర్వహించారు.

ముగిసిన ఆన్‌లైన్ శిక్షణ తరగతులు

మద్దిలపాలెం : ఏపీ పీజీ సీఈటీ ప్రవేశ పరీక్ష కోసం నెల రోజులుగా డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆన్‌లైన్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులకు రాష్ట్రం నలుమూలల నుంచి శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకూ అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారని చెప్పారు.

కౌంటింగ్ వేళ అప్రమత్తం

- అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు
- 300 మంది ఫోర్స్‌తో పర్యవేక్షణ
- పక్కాగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు
- ద్వారకా జోన్ సీఐ ఎస్.రమేష్



సీతమ్మధార: ఈ నెల 4న ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.రమేష్ తెలిపారు. ఎక్కడైనా, ఎవరైనా అల్లర్లు, అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శనివారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు.

ఊరేగింపులు, సంబరాలు చేయొద్దు

నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీ కౌంటింగ్ రోజున రాజకీయ పార్టీలు ఊరేగింపులు, సంబరాలు జరిపితే చర్యలు తప్పవని సీఐ స్పష్టం చేశారు. నగరంలో 144 సెక్షన్‌తోపాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. 300 మంది లా అండ్ ఆర్డర్ పోలీసులు, సెంట్రల్ ఫోర్స్, రిజర్వ్ పోలీసులు, ఇతర పోలీస్ ఫోర్స్ పర్యవేక్షిస్తుంటారని చెప్పారు.

గుంపులుగా ఉండొద్దు

కౌంటింగ్ రోజున ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండరాదని, ఇద్దరు కంటే మించి ఉండొద్దని సీఐ రమేష్ తెలిపారు. రౌడీషీటర్లు, పలు కేసుల్లో ఉన్న నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఇప్పటికే రౌడీషీటర్లకు ముందస్తు హెచ్చరికలు చేశామని చెప్పారు. ఎక్కడైన పెట్రోల్, మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా

ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సెంట్రల్ ఫోర్స్ పర్యవేక్షణ ఉంటుందని సీఐ చెప్పారు. సీతంపేట రెల్లి వీధి, రాజేంద్రనగర్, అశోక్‌నగర్, సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో అల్లర్లు, రెచ్చగొట్టే వ్యవహారాలు చేసే వారిపై పోలీస్ ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

ప్రజలు, యువతకు విజ్ఞప్తి

ఓట్ల లెక్కింపు రోజున యువకులు, విద్యార్థులను అల్లర్లు జరిగే ప్రాంతాలకు పంపించరాదని వారి తల్లిదండ్రులకు సీఐ రమేష్ విజ్ఞప్తి చేశారు. అనవసర కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుందని, గొడవలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాలు విడుదల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులకు వీసీ అభినందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డిగ్రీ ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో శనివారం ఉదయం అభినందించారు. సత్య డిగ్రీ కళాశాలకు చెందిన కొమ్మురు రమ్య యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. విజయనగరం జిల్లా పరిధిలో కళాశాల విద్యార్థులు కె.రమ్య, టి.ఊర్మిళ టాపర్‌లుగా నిలిచారు. వారిని వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సత్య గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. సాయి దేవ మణి, విభాగాధిపతి డాక్టర్ ఎస్.వరూధిని పాల్గొన్నారు.

కంబాలకొండలో ఫిర్యాదుల పెట్టె



టికెట్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫిర్యాదులు, సూచనలు సేకరించే పెట్టెలు

ఆరిలోవ: ప్రముఖ పర్యాటక కేంద్రం కంబాల కొండ ఎకో టూరిజం పార్కులో అటవీ శాఖ అధికారులు ఫిర్యాదులు, సలహాలు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల ఇక్కడ టికెట్ కౌంటర్ వద్ద ఫిర్యాదులు స్వీకరించే పెట్టె, సూచనలు స్వీకరించే పెట్టె వేర్వేరుగా ఏర్పాటు చేశారు. కంబాల కొండకు వెళ్లే సందర్శకులకు ఎదురైన అసౌకర్యాలు, సమస్యలపై రాసిన చీటీ ఫిర్యాదు పెట్టెలో వేయాలి. లేదంటే ఆ పెట్టె కిందన అందుబాటులో రాసిన అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ ఫోన్ నంబర్ 9440810194కు ఫోన్ చేయవచ్చని అధికారులు తెలిపారు. దీంతో పాటు పార్కు అభివృద్ధి, కల్పించాల్సిన సౌకర్యాలు, సూచనలు, సలహాల గురించి రాసిన చీటీలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసిన సలహాల పెట్టెలో వేయాలని అధికారులు కోరుతున్నారు.